క్లుప్తంగా

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: 'ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి. గెలుపోటములు సమానంగా స్వీకరించాలి. ఓటమి గెలుపుకు తొలి మెట్టని భావించి పోటీల్లో పాల్గొనాలి' అని ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ క్రీడాకారులకు సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన తాలూకాస్థాయి దసరా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 600 మంది యువ క్రీడా కారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



అమరాపురం బస్టాండ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని మడకశిర ఆర్టీసీ డిపో డీఎం రామసుబ్బారావు తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదేశాలు మేరకు బుధవారం ఆయన బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమయ్యే నిధులను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

నేడు అప్పేపల్లిలో జ్యోతుల ఉత్సవం

- ఊరేగింపుగా అమ్మవారి విగ్రహం తరలింపు



రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తరలిస్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని అప్పేపల్లి గ్రామస్తులు రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని బుధవారం సాయంత్రం ఊరేగింపుగా తరలించారు. గురువారం అప్పేపల్లిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామం నడిబొడ్డున పట్టం కూర్చోబెట్టి జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామస్తులు కోరారు.

పరిగిలో మోస్తరు వర్షం



శ్రీరంగరాజుపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

పరిగి: మండలంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, ముల్లమోతుకపల్లి, గొరవనహళ్లి గ్రామాల్లో దాదాపు గంట పాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. అలాగే పరిగి, సేవామందిరం, కొడిగెనహళ్లి, పెద్దిరెడ్డిపల్లి, కాలువపల్లి తదితర గ్రామాల్లో వాన పడింది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు ప్రవహించాయి. నీటి కుంటలు, కాలువలు, పంట పొలాలకు నీరు చేరింది. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు బుధవారం సాయంత్రం కురిసిన వానతో ఉపశమనం కలిగింది.

ఇసుక ట్రాక్టర్ సీజ్



ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

లేపాక్షి: మండల పరిధిలోని నాగానపల్లి నుంచి ఎస్టేట్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నాగానపల్లికి చెందిన మురళీ అనే వ్యక్తి గ్రామ సమీపంలోని వంకల్లోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడి పోలీసులు వెళ్లారు. మురళీని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బై బై గణేశా



మడకశిర చెరువులో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం పలు ప్రాంతాల్లో బొజ్జ గణపయ్య విగ్రహాల నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ చిన్నా, పెద్దా అందరూ చిందులేస్తూ ఆదిదేవుడిని సాగనంపారు. – సాక్షిబృందం

- భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాల నిమజ్జనం
- కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ముగిసిన కీలక ఘట్టం



సోమందేపల్లి: ఈదులబలాపురంలో వినాయకుడి ఊరేగింపు



పెనుకొండరూరల్: వినాయకుడి ఊరేగింపు



హిందూపురం: చెక్‌పోస్టు వద్ద నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



పెనుకొండ: దప్పు మోతల మధ్య సాగుతున్న ఊరేగింపు



అగళి: ఆలుడిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



పరిగి: శ్రీరంగరాజుపల్లిలో వినాయక నిమజ్జనోత్సవంలో భారీగా పాల్గొన్న జనం



రొద్దం: సుబ్బరాయప్పకొట్టాల్లో నిమజ్జనానికి తరలుతున్న ఆదిదేవుడు



పరిగి: పరిగిలో వినాయక నిమజ్జనం



పావగడ: విద్యా గణపతిని ఊరేగిస్తున్న విద్యార్థులు



మడకశిర: భీమరాయనపల్లిలో గణేశుడి ఊరేగింపు



గుడిబండ: వినాయక విగ్రహం ముందు నృత్యం చేస్తున్న మహిళలు



లేపాక్షి: పులమతిలో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రజలు

పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: పెనుకొండను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని భోగసముద్రం చెరువు కట్టపై రూ. 54 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కాలం నాటి భోగసముద్రం చెరువు కట్టపై ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి రూ. కోటి మంజూరు చేశారన్నారు. ఇందులో రూ. 54 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. రాయలకాలం నాటి పురాతన చెరువు ప్రాశస్త్యాన్ని, గొప్పతనాన్ని ప్రజలకు చాటి చెబుతూ చెరువు రూపురేఖలు మార్చేలా ఆధునీకరించనున్నట్లు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కొండపై ఘనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ చేయాలని ఇస్కాన్ ప్రతినిధులు నిర్ణయించారన్నారు. వారికే కాకుండా రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చే భక్తాదులకు అనుకూలంగా కొండపైకి రహదారి పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే బేస్ క్యాంప్ నిమిత్తం ఇస్కాన్‌కు 50 ఎకరాలు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే బాబయ్య దర్గాకు అభివృద్ధికి రూ. 4 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కాంట్రాక్టర్ భార్గవ్, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, ఎంపీపీ గీత, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జయశంకరరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

21న యూటీఎఫ్ ప్రచార యాత్ర

హిందూపురం: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావడంతో స్వర్ణోత్సవ సంబరాల వేడుకలు అక్టోబరు 1న ప్రారంభం అవుతున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.మారుతీశ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 21న హిందూపురం ఎన్‌జిఓ హోం వద్ద నుంచి ప్రచారయాత్ర ప్రారంభమై 29న ముగుస్తుందన్నారు.

నేత్రదానం



కృష్ణమూర్తి కళ్లను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

రొళ్ల: మండల కేంద్రంలోని గుడిబండ మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డులో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి (74) మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. తండ్రి కళ్లను దానం ఇస్తే ఇతరకు చూపును ప్రసాదించవచ్చన్న ఉద్దేశంతో కుమారుడు పవన్‌కుమార్ లయన్స్ ఐ ఆస్పత్రి వైద్యులు సంప్రదించారు. ఇందులో భాగంగానే వారు కళ్లను సేకరించారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

పరిగి: మండలంలోని చిన్నపల్లి, విట్టాపల్లి గ్రామాల్లో త్రైతబోధ సిద్ధాంత గ్రంథాలను బుధవారం పంపిణీ చేశారు. వినాయక చవితి, కృష్ణాష్టమి పర్వదినాలను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథాలను అందజేశారు. కమిటీ ముద్దిరెడ్డిపల్లి అధ్యక్షుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో హిందుత్వ గ్రంథాలపై అవగాహన కల్పించారు.

మెస్ చార్జీలు చెల్లించండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి కోరారు. బుధవారం స్థానిక బాలుర వసతి గృహం వద్ద విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని షీఫారం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కియా పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. మావటూరుకు చెందిన నరేష్ పనికి వెళ్తుండగా షీఫారం వద్ద ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పింది. తీవ్రంగా పడిన క్షతగాత్రుడిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

పారదర్శకంగా ఈ క్రాప్ బుకింగ్



ఈ క్రాప్‌బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణమీనన్

మడకశిరరూరల్: మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి ఆర్బీకే, వ్యవసాయశాఖ అధికారులు పారదర్శకంగా ఈ -క్రాప్ బుకింగ్ నమోదు చేయిస్తున్నామని ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. ఆయన బుధవారం జీవీపాళ్యం పంచాయతీలో పర్యటించి ఈ– క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలించారు. 30 లోపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని ఆర్బీకే ఇన్‌చార్జ్‌లకు సూచించామన్నారు. కార్యక్రమంలో ఏఓ తిమ్మప్ప, ఆర్బీకే ఇన్‌చార్జ్ శైలజ, రైతులు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే'



జీవీ పాళ్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైద్యాధికారులు భార్గవి, జయవర్ధన్ తెలిపారు. నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీవీ పాళ్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బంది, వలంటీర్ల ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని దీర్ఘకాలిక వ్యాధులు, సాధరణ వ్యాధులను యాప్ ద్వారా నమోదు చేశారు. గుర్తించిన వారికి వచ్చే నెల నుంచి వైద్య శిబిరాల ద్వారా వైద్య చికిత్సలను గ్రామ స్థాయిలోనే నిర్వహిస్తామన్నారు.

పెనుకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం మండలంలోని ఎర్రమంచి పంచాయతీలో జోరుగా చేశారు. ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసినట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు.

పరిగి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించడమే లక్ష్యమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, రూబీ తెలిపారు. బుధవారం మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు.

రాగి, మొక్కజొన్న పంటల కోత



రాగి కంకులను కుప్పగా వేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరు బావుల కింద సాగు చేసిన మొక్కజొన్న, రాగి పంటలు కోతకు వచ్చాయి. వివిధ గ్రామాల్లో రైతులు పంటలను కూలీల ద్వారా కోయిస్తున్నారు. రాగి పంట సాగుపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించడంతో రాగి పంటను సాగు చేశామని రైతులు తెలిపారు. జమ్మానిపల్లి గ్రామంలో రైతు పూజారి రంగప్ప ఎకరాలో సాగు చేసిన రాగిపంటకు ఎలాంటి తెగుళ్ల సోకకుండా కోతకు వచ్చింది. బుధవారం కూలీలో రాగి పంటను కోయించి కుప్పగా వేయించారు. అలాగే హరేసముద్రం, మణూరు, సీ కొడిగేపల్లి, ఎల్లోటి, కల్లుమర్రి తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన మొక్కజొన్న పంటను కోయిస్తున్నారు. మొక్కజొన్నకు మంచి ధర ఉందని పెట్టిన పెట్టుబడి పోనూ ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

వృద్ధులకు చెవిటి మిషన్ల పంపిణీ

గోరంట్ల: మండల పరిధిలోని కాగానిపల్లిలో 25 మంది వృద్ధులకు చేతికర్రలతో పాటు ఐదుగురికి చెవిటి మిషన్లను పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వైకేపీ కార్యాలయంలో వాటిని అందజేశారు. బుధవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వారు విన్నవించుకోవడంతో ఆయన ఆదేశాల మేరకు చెవిటి మిషన్లు, చేతికర్రలు పంపిణీ చేశారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



అక్రమ మద్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

గోరంట్ల: మండల పరిధిలోని వడ్డిపల్లికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తుండగా బుధవారం జీనవాండ్లపల్లి సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. 596 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

యోగా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ

గోరంట్ల: గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఆయూష్ వైద్యాశాలకు అనుబంధంగా యోగా సెంటర్‌కు రూ.3 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. బుధవారం ఆయూష్ డాక్టర్ల ఆధ్వర్యంలో సర్పంచ్ సరోజబాయి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, నాగేనాయక్, తులసి, డాక్టర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ జాతా విజయవంతం చేయండి

మడకశిర: మడకశిర పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే బైక్ జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కార్యదర్శి తాహిర్‌వలి ఒక ప్రకటనలో కోరారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూపురం నుంచి విజయవాడకు భారీ ఎత్తున బైక్ జాతా నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంఘీభావంగా మడకశిర నుంచి బైక్ జాతా ఏర్పాటు చేశామన్నారు.

మహిళా బిల్లుపై హర్షం

మడకశిర: ప్రధాని నరేంద్రమోదీ చొరవ తీసుకుని రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టడంపై స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప నిర్ణయమన్నారు. బీజేపీకి మహిళలపై గౌరవం ఉందనడానికి ఈ బిల్లే నిదర్శనమని చెప్పారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పురుషోత్తం, అసెంబ్లీ కో కన్వీనర్ బసవరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు లెంకప్ప, జయరామ్‌గౌడ్, గోవిందప్ప, చిదానందనాయుడు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో బోరు



బోరు నుంచి వస్తున్న నీటికి గంగపూజ చేస్తున్న మహిళలు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి బీసీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో నీటి వసతి కల్పించడానికి బుధవారం బోరు వేశారు. నిర్మాణాలకు నీరు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ వెంటనే బోరు వేయించాలని అధికారులకు సూచించారు. బుధవారం బోరు వేయడంతో పుష్కలంగా నీళ్లు పడినట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

గోరంట్ల: మండల కేంద్రంలోని మసీద్ సర్కిల్ ఏరియాలో నివాసం ఉంటున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, సాయిప్రగతి దంపతుల కుమారుడు ప్రణయ్‌సాన్విక్ (4) బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం సందర్భంగా తప్పిపోయినట్లు సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమకు సమాచారమివ్వడంతో సిబ్బందితో పట్టణం మొత్తం గాలించి బాలుడిని గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.